ప్రజాశక్తి
బుధవారం 20 నవంబర్ 2024

రైలు ఢీకొని 80 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - జామి

మృతి చెందిన గొర్రెలు

మండలంలోని భీమసింగి సమీపంలో రైలు ఢీకొని 80 గొర్రెలు మృతి చెందాయి. లక్మీపురం గ్రామానికి చెందిన గొలగాని ఎర్నాయుడు, సింహా చలం, వారాది రమణమ్మ, గొంప బంగారు నాయుడులకు చెందిన సుమారు 80 గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో రైల్వేట్రాక్ దాటుతున్న గొర్రెలను రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 30లక్షలు వరకు ఉంటుంది. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

'స్మార్ట్'గా దోపిడీ

- ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్తు స్మార్ట్‌మీటర్లు బిగింపు
- త్వరలో వ్యాపార, గృహ వినియోగదారులకు ఏర్పాటు
- ముందస్తుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్..లేదంటే కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో గుట్టుచప్పడు కాకుండా మొదలైంది. వీటిని తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తంగా 7,500 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా.. ఇప్పటి వరకూ 2250 కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఆ తరువాత వాణిజ్య, గహ వినియోగదారులకు అమర్చుతామని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. గృహ వినియోగదారుల్లో 800 యూనిట్ల పైబడిన వారికి మాత్రమే స్మార్ట్ మీటర్లు తొలుత అమర్చుతారు. ఈ మీటర్లు ఏర్పాటు వల్ల ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్తు ఉంటుంది. లేదంటే కట్ చేస్తారు. దీంతో వినియోగదారుల జేబులు గుల్ల కానున్నాయి. పేద, ధనిక, వ్యాపారస్తులు అనే తేడా లేకుండా అందరిపైనా స్మార్ట్ మీటర్లు పేరుతో విద్యుత్ భారాలు పడనున్నాయి.

జిల్లాలో వాణిజ్య వినియోగదారులు (కమర్షియల్) సుమారు లక్ష మంది, గృహ వినియోగదారులు (డొమెస్టిక్), 5,89,988 మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసే కాంట్రాక్టును అదాని సంస్థకు కేంద్రం కట్టబెట్టింది. ఒక్కో స్మార్ట్ మీటరుకు రూ.12వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిసింది. జిల్లాలో మొదటి విడతగా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్టుమీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు బిగించే ప్రక్రియను చేపడతారు. ఆ తరువాత మూడోవిడతగా గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టనున్నారు.

రీఛార్జి చేసుకుంటేనే కరెంట్..లేదంటే కట్

స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్‌ఫోన్‌లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జి చేయాల్సి ఉంటుంది. రీఛార్జి చేసుకోకపోయినా, మరచిపోయినా కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జి చేయాలంటే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీనివల్ల విద్యుత్తుశాఖకు లాభం ఉండవచ్చు గాని సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నెలకు ఒక్కసారి విద్యుత్తు బిల్లులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు వస్తే రీఛార్జి ఎప్పుడు అయిపోతే అప్పుడు వినియోగదారులు కట్టుకోవాల్సిందే. స్మార్ట్ మీటర్లు రావడం ద్వారా తొలుత ఇంటింటికీ తిరిగి బిల్లులు తీసే మీటరు రీడర్లను తొలగించే ప్రమాదం ఉంది.

కేంద్రప్రభుత్వ నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం సై..

కేంద్రప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం తలూపింది. వీటి వల్ల ఎక్కడ? ఎంత? విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుందని,ఓల్టేజీ హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతున్న లోడ్ వంటి అంశాలు తెలుస్తాయని విద్యుత్తుశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే మొబైల్స్ మాదిరిగా ముందుగా డబ్బులు కట్టి రీఛార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తు తం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెల 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లు కట్టించుకుంటున్నా రు. స్మార్ట్ మీటర్లు వచ్చాక అది కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో? సగటున అంచనా వేసి ఆ మొత్తాన్ని ముందుగానే చెల్లించి మీటరును రీఛార్జి చేసుకోవలసి ఉంటుంది. ఒకసారి అధికంగా విద్యుత్తు వినియోగిస్తే.. మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయంలో వినియోగదా రుల మొబైల్‌కు మేనేజ్ పంపిస్తారు. దాని ప్రకారం రీఛార్జి చేసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించు కోవాలి. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల భారాలు ప్రజలపై వేశారు. స్మార్ట్ మీటర్లు వలన మరింత భారాలు పెరిగే అవకాశం ఉంది. వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించు కోవడంతో పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలి.

తమ్మినేని సూర్యనారాయణ
సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి

- బహిరంగ మల విసర్జన లేని జిల్లాగా మార్చుదాం
- ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మరుగుదొడ్డి అనేది ఆత్మ గౌరవానికి చిహ్నమని, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, లేని వారికీ వెంటనే మంజూరు చేస్తామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 నుండి డిసెంబర్ 10 వరకు 'హమారా సౌచాలయ- హమారా సమ్మాన్' నినాదం తో జిల్లా అంతటా రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించడం, పరిశుభ్రంగా ఉంచడం , కమ్యూనిటీ టాయిలెట్లను వినియోగం లోనికి తేవడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. టాయిలెట్లకు ట్యాంక్ కట్టకుండా కొన్ని చోట్ల డ్రైనేజి లోకి వదిలేస్తున్నట్లు గుర్తించామని, అలాంటి వారిపై కేసులు పెడతామని తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సేవలను కలెక్టర్ అభినందించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాల కోసం పాటుపడే పారిశుధ్య కార్మికులు అభినందనీయు లని అన్నారు. ఆర్‌డబ్ల్యు ఎస్ఇ ఉమా శంకర్ మాట్లాడుతూ ఈనెల 19 నుండి డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ మాట్లాడుతూ మానవ వ్యర్థాలను సక్రమంగా డిస్పోజ్ చేయకపోతే నీటి కాలుష్యం ఏర్పడి వ్యాధుల బారిన పడతామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సూర్యనారాయణ, డిఇఒ మాణిక్యం నాయుడు, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, డిపిఒ వెంకటేశ్వర రావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు బహుమతులు అందజేసి సత్కరించారు. మరుగుదొడ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలు అందజేశారు. స్వచ్ఛతే కాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, మేయర్ విజయలక్ష్మి

పూర్తయిన సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి

పూర్తయిన కమ్యూనిటీ టాయిలెట్లన్నీ వినియోగం లో ఉండాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. నీరు, పారిశుధ్య మిషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ అయిన మరుగుదొడ్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద జిల్లాలో 530 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ లు మంజురైనాయని, అందులో 139 పూర్తి కాగా 190 పురోగతి లో ఉన్నాయని, ఇంకా 201 ప్రారంభం కావలసి ఉందని ఎస్ఇ బి.ఉమాశంకర్ తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ పూర్తయిన టాయిలెట్లన్నిటికి నీటి సరఫరా ఉండేలా చూడాలని చూడాలన్నారు. ఉపాధి నిధులతో ప్రారంభం అయ్యేలా చూడాలని, జిల్లా పరిషత్ సిఇఒ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లాబ్స్ 6 ఉన్నాయని, గజపతి నగరంలో ఒకటి మంజూరు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కోరగా కొత్త ల్యాబ్ ఏర్పాటుకు డిఒ లెటర్ రాయాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు 10 అడుగుల్లోనే ఉన్నందున, బోర్ వెల్స్ ద్వారా రబీ పంటలను పెంచేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జెడి తారక రామారావుకు సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ వెంకటేశ్వర రావు, భూ గర్భ జల, డిఆర్‌డిఎ, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబరు నేరాల నియంత్రణకు సహకరించాలి

బ్యాంకర్ల సమావేశంలో ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో నమోదవుతున్న సైబరు మోసాల నియంత్రణకు బ్యాంకు అధికారులు కూడా సహకరించాలని, సైబరు కేసులను దర్యాప్తు చేసే పోలీసు అధికారులకు తమ సహాయ, సహకారాలను అందించాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌కోరారు. వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు మేనేజర్లు, ఇతర అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్‌పి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరు మోసాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని, మోసగాళ్ళు కొత్త కొత్త తరహాల్లో మోసాలకు పాల్పడుతూ, ప్రజల నుండి డబ్బులను దోచేస్తున్నారని, ఈ తరహా మోసాలను నియంత్రించేందుకు బ్యాంకు అధికారులు కూడా సకాలంలో స్పందించి, తమ వంతు సహాయ, సహకారాలను పోలీసు అధికారులకు అందించాలని కోరారు. పోలీసు అధికారులు కూడా దర్యాప్తులో భాగంగానే బ్యాంకుల నుంచి కోరిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సమాచారాన్ని సకాలంలో ఇవ్వకుంటే మోసానికి పాల్పడిన వ్యక్తి తప్పించుకొనే అవకాశం ఉంటుందన్నారు. గుర్తింపు కార్డులను పూర్తిగా వెరిఫై చేసిన తరువాతనే బ్యాంకు అకౌంట్ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపే అనుమానాస్పద బ్యాంకు అకౌంట్లపై నిఘా పెట్టాలన్నారు. ఎటిఎం కేంద్రాలు, బ్యాంకుల్లో సిసి కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు ఉండే విధంగా చూడాల న్నారు. బ్యాంకు అధికారులతో పాటు డిఎస్‌పిలు, సిఐలు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

సివిల్స్ ఉచిత శిక్షణకు 24లోగా దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్, సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకు ఈనెల 24లోగా దరఖాస్తు చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జి.పెంటోజీరావు తెలిపారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ అభ్యర్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, 2 ఫోటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డ్ జత పరిచి ఈ నెల 24 లో గా ధరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల కార్యాలయం, కలక్టరేట్ కార్యాలయం, మొదటి అంతస్తు, సర్వ శిక్ష అభియాన్ ఎదురుగా అందజేయాలని తెలిపారు. వివరాలకు 9849906005 నంబరును సంప్రదించాలని తెలిపారు.

వసతిగృహాల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు

7 కొత్త హాస్టళ్ల నిర్మాణం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని వసతిగృహాల్లో విద్యార్థులకు వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖల పరిధిలోని హాస్టళ్లలో వసతులపై కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. వసతుల కల్పనకోసం అవసరమైన నిధులకోసం ఆయా ప్రభుత్వ శాఖలకు నివేదించాలన్నారు. జిల్లాలో 51 బి.సి.సంక్షేమ వసతి గృహాలకు గాను 32 హాస్టళ్లకు సొంత భవనాలు వున్నాయని, 19 హాస్టళ్లకు భవనాలు నిర్మించాల్సి వుందని బిసి సంక్షేమ అధికారి పెంటోజీరావు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం సొంత భవనాలు వున్న 32 బిసి సంక్షేమ వసతిగృహాలకు మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.1.06 కోట్లతో ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి మొత్తం 30 హాస్టళ్లు వున్నాయని, వీటిలో 23 హాస్టళ్లకు సొంత భవనాలు వున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం తెలిపారు. కేంద్ర పథకం పి.ఎం.అజయ్ కింద ఒక్కొక్కటి రూ.3 కోట్ల వ్యయంతో 6 హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 23 హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.1.09కోట్లతో ప్రతిపాదించామని వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 3 హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.33లక్షలతో ప్రతిపాదనలు చేశామని గిరిజన సంక్షేమ అధికారిగా వ్యవహరిస్తున్న బి.రామానందం తెలిపారు. మహారాణిపేట పోస్ట్ మెట్రిక్ బాలికల వసతిగహాన్ని రూ.4 కోట్లతో నిర్మించనున్నట్లు వివరించారు.ఇప్పటికే దీనికి అవసరమైన అనుమతులు వచ్చాయన్నారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాల ఇంజనీర్లు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల పెంపు ఉత్తర్వులను వెనక్కితీసుకోవాలి

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలు నుండి సాయంత్రం 5గంటలట వరకు పనిచేయాలని, పైలట్ ప్రోగ్రాంగా మండలానికి ఒక ఉన్నత పాఠశాలను 6 రోజులు నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు 6-7 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు వస్తున్నారని, వారు తిరిగి ఇంటికి చేరే సమయానికి చీకటి పడటం, భద్రతకు గ్యారంటీ లేక పోవటం, మధ్యాహ్నం భోజనం తరువాత ఎటువంటి పోషకాహారం తీసుకునే అవకాశం లేకపోవటం వల్ల విద్యార్థులు అసౌకర్యానికి గురై పాఠశాల నుంచి డ్రాపౌట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని, ఎటువంటి ప్రయాణ ఏర్పాట్లూ చేసుకునే అవకాశం లేదని పేర్కొన్నారు.

పొరుగు రాష్ట్రాల్లో సిబిఎస్ఇ పాఠశాలలు, విద్యా రంగంలో అభివద్ధి చెందిన ఏ రాష్ట్రంలోనూ ఈ రకమైన సమయం అమల చేయడం లేదని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో సిబ్బందిని నియమించి, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని సెక్షన్‌కు 30గా పరిగణించి, పూర్తి మౌళిక సౌకర్యాలు కల్పించి విద్యారంగాన్ని బలోపేతం చెయ్యటానికి కృషి చేయాలని కోరారు. బోధనకు ఆటంకంగా వున్న బోధనేతర కార్యక్రమాలు, యుడైస్, ఆపార్, మ్యాప్‌ల నిర్వహణను ఉపాధ్యాయుల నుండి తప్పించేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం కలుగు తుందని తెలిపారు. నేడు చాలా మంది పేర్లు ఆధార్, యు డైస్‌లో ఒకేలా ఉండక పోవటం వలన పాఠశాలలకు వెళ్లకుండా పంచాయతీ కార్యదర్శుల వద్దకు, లాయర్ల వద్దకు నోటరీల కోసం తిరిగి వందలాది రుపాయల ఖర్చు పెట్టుకుంటు న్నారని, ఇటువంటి విధానాలను సవరించి పిల్లలకు నాణ్యమైన విద్య అందే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత కాలంలో, పూర్తి నాణ్యత ప్రమాణాలతో జరగాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్ లో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పూర్తయిన పనులు, చేపట్టబోయే పనుల ప్రగతికి గూర్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అన్నారు. యం బుక్ లు తప్పనిసరిగా సంబంధిత ఎఇల వద్దే ఉండాలని చెప్పారు. లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ కు ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. పార్కులను పరిరక్షించుకోవాలని, వాటికి అవసరమైన రక్షణ గోడలను నిర్మించాలని చెప్పారు. రోడ్డు కల్వర్టులు మరమ్మతులు చేపడుతున్న సమయంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 24వ తేదీ లోపుగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద మరుగుదొడ్ల ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపనలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఇ టి.రాయిల్ బాబు, డిఇలు ప్రసాద్, శ్రీనివాసరావు, మణికుమార్,ఉద్యాన శాఖ అధికారి ఉమాభరణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

కిశోర బాలికల సంరక్షణపై అవగాహన ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రానున్న రోజుల్లో జిల్లాలో ఆరోగ్యపరమైన లోపాలతో ఏ ఒక్క శిశువు జన్మించకుండా చూడాలనే లక్ష్యంతో అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను కిందిస్థాయి వరకు తీసుకువెళ్లి అవగాహన కల్పించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన శిక్షకులను ఉద్దేశించి కలెక్టర్ మంగళవారం మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న ప్రసవాల్లో 6శాతం మంది పిల్లలు రక్తహీనతతో, మరికొంత మంది తగిన బరువు లేకుండా, మరికొంత మంది పిల్లలు ఇతర లోపాలతో జన్మిస్తున్నారని, ఇటువంటి లోపాలన్నింటినీ పూర్తిగా నివారించాలంటే కిశోర బాలికల్లో తగిన అవగాహన కలిగించడం వల్లే సాధ్యమవుతుందని అన్నారు. తక్కువ వయసులో జరిగే వివాహాలు, తగిన పోషకాహారం తీసుకోకపోవడం వంటి కారణాలే గర్భిణీల్లో అనారోగ్యానికి దారితీస్తున్నాయనే విషయాన్ని చెప్పాలన్నారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్య, సామాజిక, న్యాయపరమైన, స్వీయరక్షణకు సంబంధించిన అంశాల్లో అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ కేసలి అప్పారావు, డిఇఒ మాణిక్యం నాయుడు, నేచర్ సంస్థ ప్రతినిధి వికాస్, ఐసిడిఎస్ పిఒలు, సెర్ప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 15న విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ బాక్సింగ్ ఇంటర్ కాలేజ్ గేమ్స్‌లో విజయనగరం క్రీడాకారులు మూడు బంగారు పతకాలు ఒక సిల్వర్ పతకం సాధించారు. ఎస్. తేజేశ్వర్ 48 కిలోల విభాగంలో బంగారు పతకం, ఎ .సాయి 48-51 కిలోల్లో బంగారు పతకం, జి. లిఖిత్ రెడ్డి 92 కిలోల కేటగిరిలో బంగారు పతాకం, ఎస్‌కె సుల్తానా కాంస్య పతాకం గెలుపొందారు, వీరిని రాష్ట్ర ఉపాధ్యక్షులు డోలా మన్మధ కుమార్ అభినందించారు. బంగారు పతకాలు సాధించిన వీరు ముగ్గురు పంజాబ్‌లో డిసెంబర్ 26 నుంచి జనవరి 2 వరకు జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. క్రీడాకారులను శాప్ కోచ్ బి.ఈశ్వర రావు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

బాక్సింగ్‌లో 'గాయత్రి' విద్యార్థికి బంగారు పతకం

విజయనగరం టౌన్ : గాయత్రి డిగ్రీ కళాశాలలో బికాం మొదటి సంవత్సరం చదువుతున్న గాబు లిఖిత్ కుమార్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించాడు. ఈనెల 15న ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన హెవీ వెయిట్ బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా అతడిని గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.గౌరీశ్వరి, డైరెక్టర్ డాక్టర్ కె.ప్రసాద్ , కరెస్పాండెంట్ నవీన్ కుమార్ , వైస్ ప్రిన్సిపల్ ఆర్.మురళీమోహన్ అభినందించారు.

పిల్లలకు నేత్ర పరీక్షలు చేయించాలి : కలెక్టర్

విజయనగరంకోట : నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో దృష్టి లోపాలు వచ్చే అవకాశాలు వుంటాయని, అటువంటి వారికి కంటి పరీక్షలు చేయించడంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సూచించారు. పుష్పగిరి కంటి ఆసుపత్రికి చెందిన విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ప్రి మెచ్యూర్ డే నడకను మంగళవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలలు నిండకుండానే పుడుతున్నారని, వారికి జన్మించిన వెంటనే కంటి పరీక్షలు నిర్వహించకపోతే పదిశాతం మంది అంధత్వానికి గురయ్యే ప్రమాదం వుంటుందన్నారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి సిఇఒ రాజేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ, అంధత్వ నివారణ సంస్థ ఆప్తాల్మిక్ ఆఫీసర్ తారక్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లును తెరచి ఉపాధి కల్పించండి

జాయింట్ సమావేశంలో కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అక్రమ లాకౌట్‌లో ఉన్న నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు తిప్పి కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం విశాఖపట్నం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద నెల్లిమర్ల జ్యూట్ మిల్ సమస్యపై జాయింట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తరపున కిల్లంపల్లి రామారావు, అప్పలనర్సయ్య, ఐఎఫ్‌టియు తరపున నామాల తిరుపతి రావు, కె. అప్పల సూరి, టి. అప్పారావు, శ్రామిక సంఘం తరపున చిక్కాల గోవిందరావు, సముద్రపు సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా జ్యూట్ యాజమాన్యం గ్రాడ్యూటీ బకాయిలు ఇవ్వలేదని, పోస్ట్ డెటెడ్ చెక్‌లు ఇవ్వడం వల్ల రిటైర్డ్ కార్మికులు బ్యాంకు వద్దకు వెళ్తే ఖాతాలో నగదు లేక తిరిగి యాజమాన్యం ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయిపోతున్నాయని తెలిపారు. గత 3 సంవత్సరాలుగా యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్ నగదు కార్మికుల నుంచి తీసుకొని సంబంధిత అధికార్లకు చెల్లించలేదని చెప్పారు. కాగా కార్మికుల నుంచి యాజమాన్యం డెత్ ఫండ్ వసూలు చేసి రెండు, మూడు నెలల తరువాత ఆయా కుటుంబాలకు యాజమాన్యం వాటా లేకుండా ఇస్తుందని తెలిపారు. ముడి సరుకు కొరత పేరిట జ్యూట్ యాజమాన్యం కార్మికులు సహకరించలేదని చెప్పడం భావ్యం కాదన్నారు. కాగా 1989 నుంచి కార్మికులు 5,10,18 రూపాయలు యాజమాన్యానికి రుణంగా ఇచ్చి సహకరించారని చెప్పారు. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని జ్యూట్ యాజమాన్యానికి కార్మికులు సహకరిస్తుంటే యాజమాన్యం మాత్రం ముడి సరుకు కొరత పేరిట మిల్లుని అక్రమ లాకౌట్ చేసి ఉపాధి లేకుండా చేయడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మిల్లు తిప్పి ఉపాధి కల్పించడమే కార్మిక సంఘాల లక్ష్యమని పేర్కొన్నారు. కాగా మిల్లు తిప్పి ఉపాధి కల్పిస్తారా లేకపోతే ఇతర మిల్లుల్లా గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించడంతో బాటు కార్మికులకు యాజమాన్యం ఇవ్వాల్సిన 5,10,18రూపాయలు తిరిగి చెల్లించి సెటిల్ మెంట్ చేసుకుంటారా అని ప్రశ్నించారు. అనంతరం ఎసిఎల్ మాట్లాడుతూ వచ్చే నెల 17కు ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని అప్పటికీ యాజమాన్యం రాకపోతే కలెక్టర్, ఉన్నాతాధికార్లకు నివేదిస్తామని చెప్పినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.


విశాఖలో ఎసిఎల్‌తో చర్చిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు

రామతీర్థం, చింతపల్లి, తాటిపూడి లో పర్యాటక వసతుల కల్పన

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పర్యాటక ప్రదేశాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. సిపిఒ పి.బాలాజీ, పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ తదితరులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. రామతీర్థంలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా మ్యూజియం, కేఫ్‌టేరియా, మ్యూజియం, వ్యూపాయింట్‌లు, రోప్ వే, లైటింగ్, సమీపంలోని బౌద్ధ ప్రదేశాల వద్ద వసతులు, కోనేరు, రోడ్డు విస్తరణ వంటి పనులకు ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చింతపల్లి బీచ్ వద్ద సముద్రతీర పర్యాటకం అభివద్ధిలో భాగంగా ప్రస్తుత కాటేజీల స్థానంలో కొత్తగా పది కాటేజీల నిర్మాణం, రెస్టారెంట్, చిల్డ్రన్ పార్కు వంటి వసతుల కల్పనకు ప్రతిపాదించాలని పేర్కొన్నారు. తాటిపూడిలో పర్యాటకుల కోసం బోట్లను నడిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చినందున, కాటేజీల వరకు రోప్ బ్రిడ్జి నిర్మాణం, అక్కడ వున్న పది ఎకరాల స్థలంలో కేఫ్‌టేరియా, బర్డ్‌పార్కు, కన్వెన్షన్ హాలు తదితర సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదించాలన్నారు.

విద్య, ఆరోగ్యంతో పాటు భద్రత ముఖ్యం : కేసలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బాలలకు చదువు, ఆరోగ్యంతో పాటు భద్రత ముఖ్యమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. కలెక్టర్ ఆడిటోరియంలో కిశోరి వికాసం పథకం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలలతో పనిచేస్తున్న అధికారులు, సంస్థలు, సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో విజయనగరం జిల్లాను బాలల స్నేహ పూర్వక జిల్లా గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కోరారు. బాలలు దురలవాట్లు, చెడు స్నేహాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాలలు అందరూ లైఫ్ స్కిల్స్ తో పాటు స్వయం రక్షణకు కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆరు నెలల తర్వాత శాసనమండలికి

శృంగవరపుకోట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని మండలి చైర్మన్ రద్దు చేస్తూ గతంలో ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ విషయమై రఘురాజు హైకోర్టును ఆశ్రయించగా అనర్హత వేటు చెల్లదని హైకోర్టు తీర్పునివ్వడంతో ఆయన మరల తిరిగి ఆరు నెలల తర్వాత మంగళవారం శాసనమండలిలో అడుగుపెట్టారు. రఘురాజు శాసనమండలిలో అడుగుపెట్టడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జననేనా ఈ ప్రాంత సమస్యలపై మండలిలో గట్టిగా మాట్లాడతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

డెంకాడ: రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను విడనాడి, ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్. శారద జయలక్ష్మి దేవి అన్నారు. మండలంలోని డెంకాడ గ్రామంలో రైతు కలిదిండి పాణి రాజు కల్లంలో ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఏరువాక క్షేత్ర దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. పరిశోధన సంస్థలకు డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త రకాలు ఎంపిక, ఎమ్టియు 7034, 7039 రకాల పనితీరును పరిశీలించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, కలిదిండి పాణిరాజు, డాక్టర్ ఎంఎంవి శ్రీనివాస్, డాక్టర్ పాత్రో, ఎఆర్ఎస్, గజాలు రేగ, జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ విటి రామారావు, ఎ.నాగభూషణం, వ్యవసాయ సహాయ సంచాలకులు, విజయనగరం, డాక్టర్ సాంబయ్య, రైతులు పాల్గొన్నారు.

'మిరాకిల్'లో ఘనంగా మేనేజ్‌మెంట్ డే

భోగాపురం: మండలంలోని ముక్కాం సమీపంలోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అధ్యక్షులు డాక్టర్ త్రినాధరావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో అనేక సేవలు అందించిన పీటర్ అనే రచయిత జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వ్యాపార ప్రణాళికలు, వ్యాపార వ్యూహ నిర్వహణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాసరావు బెహ్రా మాట్లాడుతూ ఎంబిఎ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ ఎస్ ఏ హుస్సేన్, కన్వీనర్ అనుపమ, కో కన్వీనర్ దామోదర్, ప్రొఫెసర్ లింగాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం ఏర్పాటు

తెర్లాం: మండలంలోని మదంబట్లవలస గ్రామపంచాయతీలో డాక్టర్ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి రైతుల తమ పశువులకు తనిఖీలు చేయించారు. 16 ఎదకి రానివి, 18 గర్భ కోశ వ్యాధులు కలిగినవి, 6 జనరల్ కేసులకు సంబంధించి తనిఖీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ అప్పారావు, డాక్టర్ అరుణ, పుష్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ పరిశీలన

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతోనూ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్ చేసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల లబ్ధిని పొందాలన్నారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపల్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాప్ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం టౌన్ : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఆవిర్భావ దినోత్సవం రెడ్ క్రాస్ నిర్వాహయ వసతి భవనంలో మంగళ వారం జరిగింది. సమావేశ సభ ఎడి రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్డి ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కోసి వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎడి రమేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలన్నారు. కెఆర్డి ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల పురోగతి దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. జాప్ అధ్యక్షులు మానాపురం రవిచంద్రశేఖర్, కోశాధి కారి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు అల్లాడ రమణ, కార్య నిర్వాహణ కార్యదర్శి వి.గౌరీ శంకర్, కార్యదర్శులు, ఎం.హేమంత్ కుమార్, ఆర్కే నాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు జాప్ నాయ కులు కలిసి సన్మానించారు. జర్నలిస్టుల సంక్షే మానికి కృషిచేస్తామని కలెక్టర్ తెలిపారు. జాప్ నాయకులు జామి కృష్ణ, జాప్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గొర్లె సూరిబాబు జాప్ జిల్లా నాయకులు నక్కా ఆంజనేయులు, రావాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన పరిశీలన

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ, మొయిద, జరజాపుపేట, నెల్లిమర్ల గ్రామాల్లో మంగళవారం 21వ పశుగణన పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డిహెచ్ వై.వి. రమణ పశుగణన పరిశీలించారు. కార్యక్రమంలో ఎడి జె.చక్రవర్తి, పశువైద్యులు, పశుగణకులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షన్ ఇవ్వడంలో కేంద్రం విఫలం

గరివిడి : ఇపిఎఫ్ కనీస పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వడంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌరినాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ మోడీ వైఖరిని వ్యతిరేకిస్తూ మంగళవారం గరివిడిలో అంబేద్కర్ బొమ్మ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశంలో 75 లక్షల మంది ఇపిఎఫ్ పెన్షనర్స్ ఉన్నారని వీరిలో 35 లక్షల మందికి కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు, అంతకంటే తక్కువే వస్తుందని గుర్తు చేశారు. ఇంకోవైపు నిత్యవసర వస్తువుల ధరలు, మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో పిఎఫ్ పెన్షనర్లు బతకడం చాలా కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా సుప్రీమ్‌కోర్టు తీర్పు ప్రకారం కనీసం రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిలీం, ఒఓఎస్ఎన్ మూర్తి, గంట్యాడ అప్పలరాజు, మైన్స్ నాయకులు కరణం సన్యాసినాయుడు, చలపతి పాప నాయుడు, సపపతి తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

విజయనగరం టౌన్ : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగరం పట్టంలో అంబర్ సత్రం వద్ద ఉన్న ప్రెస్‌క్లబ్ లో రజక సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. తక్షణమే రజక చట్టం ఏర్పాటు చేయాలని పిట్టి చేశారు. ఇందులో భాగంగా రేపు వచ్చే నెల 10న కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు తంగేటి భాస్కరరావు, చైర్మన్ అప్పికొండ సన్యాసిరావు, కార్యదర్శి జంపా చిన్న, కోశాధికారి రాజారావు, జాయింట్ సెక్రెటరీ సింహాచలం, చిట్టిబాబు ఉపాధ్యక్షులు, తాతారావు, గోవింద, పైడిరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏక గ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.ఆర్.కె. ఈశ్వరరావు తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.హెచ్. నిర్మలదేవి, జి.విజయగౌరి, గౌరవ అధ్యక్షులుగా ఎన్.ఎస్. ప్రసాద్, సహధ్యక్షులుగా పి. కనకరత్నం, ఏ. సురేష్ కుమార్, కోశాధికారిగా సి.హెచ్. రవికుమార్ ఎన్నికైనట్లు ఆయన వెల్లడించారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు.

నేటి నుంచి తీర ప్రాంత గ్రామాల్లో సాగర్ కవచ్

ప్రజాశక్తి - భోగాపురం

సముద్ర తీరం ద్వారా వచ్చే చొరబాటు దారులను సమర్థవంతంగా అడ్డుకోవాలని డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సాగర్ కవచ్ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి మంగళవారం సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతం నుంచి జాతీయ రహదారికి వచ్చే జంక్షన్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ సాగర్ కవచ్ కార్యక్రమంలో మొత్తం 130 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు ప్రభాకర్, బివిజె రాజు, ఎస్ఐలు పాపారావు, స్వీటీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలి

ప్రజాశక్తి- డెంకాడ

మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు కోరారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు గుండా చేపల కథ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మరుగుదొడ్లు లేని వారు నూతనంగా నిర్మించుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై. భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, పాషా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాడంగి: ప్రతి వ్యక్తి మరుగుదోడ్లు ఉపయోగించాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత మరుగుదోడ్లను ఉపయోగించకపోతే, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. మరుగుదొడ్లపై డిసెంబరు 10 వరకూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎంపిటిసి పాలవలస గౌరు ఎరుకుల పాకాల గ్రామంలో మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ర్యాలీ చేశారు.

వంగర: మండలంలో అన్ని గ్రామాలలో ఇప్పటికే నిర్మించిన మరుగుదొడ్లను అందరు పూర్తిస్థాయిలో వాడుకునేటట్లుగా ప్రజలకు చైతన్య పరచాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అధికారులు, స్వయం సహాయక సంఘాలు మహిళలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ లోపింటి త్రినాధరావు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

డెంకాడ: నినాదాలు చేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

మెంటాడ: మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ భానుమూర్తి అన్నారు. మంగళవారం మెంటాడ హైస్కూల్ నుంచి గచ్చిం చెట్టు వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మెంటాడ హైస్కూల్ హెచ్ఎం సిహెచ్ అరుణ, ఇఒపిఆర్‌డి విమల కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్, సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎపిఒ చిన్నప్పయ్య, పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి రామ మందిరం వరకూ మెయిన్ రోడ్డులో ఎంపిడిఒ రాంబాబు, ఎంపిపి ఎం. ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా కాపాడుకోవాలని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని కోరారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి. రూప, ఎంపిటిసి జి.ఆనంద్, ఎంఇఒ ఎం. పాపారావు జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి డి.సత్యవంతుడు ఆధ్వర్యంలో ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ టాయిలెట్ నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పల నాయుడు, జెఇ వి.దేవి, ఇఒపిఆర్‌డి రవికుమార్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, ఎపిఒ ఆదిలక్ష్మి, వేపాడ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.మండలంలోని 18 గ్రామ సచివాలయాలు పరిధిలో ఉన్న పంచాయతీలలో మంగళవారం ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవాన్ని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామభద్రపురం: బహిరంగ మల విసర్జన విడనాడి ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరుతూ స్థానిక పూడి వీధి పాఠశాల వద్ద ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇఒపిఆర్‌డి వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్కూల్ హెచ్ఎం విజయగౌరి, స్థానిక సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పిహెచ్‌సి సూపర్‌వైజర్ వాసుదేవరావు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మరుగుదొడ్డు ఉన్న ఇండ్లు వ్యాధులకు దూరంగా ఉంటాయని ఎంపిడిఒ సతీష్ అన్నారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సందర్భంగా పట్టణంలోని స్కూల్స్, కాలేజీల విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి - విజయనగరం కోట

భారతదేశం కోసం ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి డిసిసి అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని అన్నారు. ఆమె ప్రజల సౌకర్యార్థం 1969 లో బ్యాంకులను జాతీయకరణ చేసి జాతికి అంకితం చేశారన్నారు. దేశం కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమైనవి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, ఎస్ శ్రీనివాస్, బంగారు నాయుడు, పి. శ్రీనివాస్, అచ్చిబాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని గాంధీ పార్క్ ఆవరణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గేదెల తిరుపతి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి మిఠాయిల పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు, మండల అధ్యక్షులు చింతల ఈశ్వర్ రావు, ఎల్ కోట పార్టీ అధ్యక్షులు గురు మోహన్ రావు, జామి మండలం పార్టీ నాయకులు కొత్తిలి కృష్ణ, పట్టణ నాయకులు హనుమాన్ శెట్టి నానాజీ పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలు ఆ గ్రంథాలయ శాఖ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి చేసిన సేవలు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆటలు పోటీలు, క్విజ్ పోటీ నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం: ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను నెల్లిమర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త గంటా సత్యనారాయణ, నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకల పద్మనాభం, రాయల సురేశ్, ఎస్ పృథ్వి, మురళి, ప్రశాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఆటల పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి మునిసిపాలిటీ పరిధి కోరాడ వీధిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం మహిళలకు రంగవల్లులు, ముగ్గుల పోటీ, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహించారు. బుధవారం వారో త్సవాల ముగింపు కార్యక్రమంలో ఈ వారంలో జరిగిన పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ ఎస్. స్వర్ణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం చింతల వీధి పాఠశాల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయిని పావని ఆధ్వర్యంలో వివిధ నీతి, చారిత్రక కథలు చెప్పి అలరించారు. మరో ఉపాధ్యాయులు ప్రభాకర్ ఆధ్వర్యంలో పద్య పఠనంపై పోటీలు నిర్వహించారు. తదుపరి మన భారత దేశ మొదటి మహిళా ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించి ఆమె చేసిన సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యవాణి, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేగిడి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో రంగవల్లులు పోటీలు రసవత్తరంగా జరిగాయి. గ్రంథాలయ అధికారి పెంట ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయ ఎఒ డి.నాగమణి ముగ్గుల పోటీలను పరిశీలించారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను గుర్తించారు. ఈ నెల 20న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని గ్రంథాలయ అధికారి ఈశ్వరరావు తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సంతకవిటి: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు రంగవల్లిక పోటీలను శాఖ గ్రంథాలయాధికారి డోల శ్రీదేవి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలోనూ, లక్కవరపుకోట మండల కేంద్రంలో గల శాఖ గ్రంథాలయంలోనూ వేడుకగా రంగవల్లికలను స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్, లక్కవరపుకోట మండల కేంద్రంలో గల శాఖా గ్రంథాలయంలో బి మేరీ నిర్మల విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఎస్ కోట శాఖా గ్రంథాలయంలో అరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ అధ్యాపకురాలు ఏడువాక విజయలక్ష్మి పర్యవేక్షణలో రంగవల్లికలు, మహిళా సాధికారత మీద డిబేట్, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, గ్రంథాలయ సిబ్బంది పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక హైస్కూల్ విద్యార్థులకు మ్యూజికల్ చైర్ నిర్వహించారు. ఈ గేమ్‌లో జ్ఞానేశ్వరరావుకు ప్రథమ, జగత్‌కు ద్వితీయ, గౌరీ శంకర్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారని గ్రంథాలయాధికారి మహేష్ తెలిపారు. వీరికి బుధవారం బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు.

విజయనగరం కోట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గాజులరేగ శాఖా గ్రంథాలయంలో వీరవనితల చిత్రపటాలకు నివాళులర్పించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. నారాయణ స్కూలు ప్రిన్సిపల్ నారాయణరావు , బిఈడి స్టూడెంట్ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శాఖ గ్రంథాలయ అధికారి ఎం. లక్ష్మణరావు అధ్యక్షత వహించారు.

సమాజ ప్రగతికి కాంతి దివ్వెలు గ్రంథాలయాలు

సమాజ ప్రగతికి కాంతి దివ్వెలు గ్రంథాలయాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గాజులు రేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలను విద్యార్థులతో ప్రదర్శించి వారి గొప్పతనాన్ని తెలిపారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని బి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులపై వివిధ సూక్తులను రాసి ప్రదర్శించారు.

అప్పుడు మాయమైతే ఇప్పుడు దర్యాప్తా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి రెవెన్యూ పరిధిలో గల వెంకయ్య పాలెం వద్ద జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సేవా సంఘం భూ అభివృద్ధి పథకం ద్వారా కొని ఇచ్చిన 22 ఎకరాల్లో విలువైన టేకు చెట్లు మాయమయ్యాయి. ఈ విషయంపై పత్రికల్లో పలు కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన తహశీల్దార్ రాములమ్మ పరిశీలన చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈనెల 18న ప్రజా సమస్యల పరిష్కార వేదిక విభాగంలో సామాజిక కార్యకర్త అప్పారావు జరిగిన సంఘటన గూర్చి జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి వివరించారు. దీంతో వెంటనే తగు చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అటవీ శాఖ అధికారులు డిప్యూటీ రేంజర్ జె రవికుమార్, గార్డు డి. సూర్యనారాయణ, క్షేత్ర స్థాయిలో సామాజిక కార్యకర్త ఆర్ అప్పారావు సమక్షంలో దర్యాప్తు చేశారు. ఈ టేకు చెట్లు మాయం అటవీ శాఖ పరిధిలో లేదని, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ పరిధిలో ఉందని జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. అటవీ అధికారులను అప్పారావు టేకు చెట్లు నరకడానికి మీ శాఖ అనుమతులు అవసరం లేదా అని అడగగా అటవీ శాఖ అధికారుల నుంచి సమాధానం రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సి ఉండగా వారే ఈ విదంగా అక్రమార్కులకు అండగా నిలుస్తూ ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడం ఏంటని ప్రశ్నించగా అటవీ అధికారులు మౌనం దాల్చి వెనుదిరిగారు. దొంగల పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు చెట్లు మాయమై మూడు వారాలు అయిన తరువాత దర్యాప్తు చేపట్టడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొలతలు వేస్తున్న ఉద్యోగి

కళాశాలల మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం మధ్యాహ్నం కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటేషన్స్ (సిఎస్‌సి ఇండియా) విశాఖపట్నం వారితో పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎస్‌సి సలహాదారులు వై.రామ్మోహన్‌రావుతో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అవగాహన పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వై.రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికతపై సి-డాక్, ఐఇఇఇ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు, బ్రిటిష్ ఇంగ్లీష్ కౌన్సిల్ ద్వారా ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు యన్ఐఈఎల్ఐటి త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై వాద్వాని ఫౌండేషన్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలు, పారిశ్రామిక వ్యవస్థాపకత పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కళాశాలలో సౌకర్యాలు వినియోగించుకుని స్కిల్స్‌ని అభివృద్ధి చేసుకుంటూ, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ప్రయోగశాలగా మార్చకండి

శృంగవరపుకోట: గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలను ప్రయోగశాలగా మార్చి కొత్త కొత్త ప్రయోగాలు చేయడంతో లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపునకు వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడిందని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కళావేదిక వద్ద మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకుంటారనుకుంటే ధోరణి మార్పు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా హఠాత్తుగా పాఠశాల పనివేళల పెంపు నిర్ణయం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 15 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారని రవాణా సౌకర్యం లేకపోతే బాలికలకు భద్రతాపరమైన సమస్యలు వస్తాయని అన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. No. 19 /2024

Between:-
Tupakula Yuvaraju. ....petitioner
And:-
Dannana Kanaka Raju and 10 others
....Respondents

Hearing Date: 02-12-2024

Notice to R1, R2, R3,R4, R5, R6, R7, R8, R9, R10& R11.

R1) Dannana Kanaka Raju 5/0 Dannana Satyam, aged about 35 years, Hindu R/at H. No. 150, P.B. Colony, Bit No. 1 Auto Junction, Vizianagaram Town and District
R2) Botcha Usha w/o Botch Sriramulu, aged 42 years, R/at H. No 180, rest -do-
R3) Vummidi Adilakshmi w/o Ramu, aged about 55 years, Hindu, residing at H. No. 150, rest-do
R4) Somadula Pydiraju W/o Seetayya, aged about 53 years, Hindu, residing at H. No. 190, rest-do-
R5) Bandaru Ratnam w/o Satyanarayana, aged about 55 years, Hindu, residing at H. No. 187, rest-do-.
R6) Chandaka Simhachalam w/o Babu Rao, age 65 years, Hindu, residing at H. No. 183, rest-do-.
R7) Kesam lakshmi, D/o Kesam panda age 37 years, Hindu, labour, R/at H.No. 106 rest-do-.
R8) Mylapalli Chandara Rao, M/o Mylapalli Polamma, age 45 years, Hindu, residing at H. No. 132, rest-do-.
R9) Karri Yellamma w/o karri yellayya, age 70 years, Hindu residing at H.No.106, rest-do-.
R10) Murapala Applanaidu Yadav son of unknown, age 35 years, Hindu, finance business, residing Bondapalli Village and mandai, Vizianagaram district.
R11) Sampangi Nagamani w/o Sanyasi Rao, age 35 years, Hindu, residing at H.No. 140, Relli veedhi, Potnuru Village, Reddypalli mandal, Visakhapatnam District.

ఇందు మూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, విజయనగరం పట్టణం, పూల్‌బాగ్‌కాలనీ H.No. 21-40-1 కాపురస్తుడు లేటు తుపాకుల ఆదినారాయణ గారి కుమారుడు తుపాకుల యువరాజు తనకున్న అప్పులు చెల్లించే శక్తి లేదని తీర్పు చేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో I.P.No.19/2024 పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని లేదా వకీలుగారి ద్వారా గాని **తే 02-12-2024 దిన ఉదయం గం॥ 10.30 ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెనని, లేని పక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈపత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

MAVURI SANKARA RAO
ADVOCATE, NELLIMARLA
VIZIANAGARAM DISTRICT
Mobile no: 9440074142

పాలవలసలో చోరీ

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పాలవలస గ్రామంలో తాడి గౌరీ నాయుడు ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులో ఉన్న బంగార ఆభరణాలు డబ్బులు దొంగిలించినట్లు పోలీసులకు గౌరినాయుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరీ నాయుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, ఉదయాన్నే గౌరినాయుడు తన విధులకు వెళ్ళిపోయాడని చెప్పారు. అతని భార్య అప్పలకొండ వ్యవసాయ పనుల నిమిత్తం కూలి పనులు కోసం నెల్లిమర్ల వెళ్లి పోయిందని, ఇద్దరు కుమారులు పాఠశాలకు వెళ్లిపోయారని ఎస్ఐ వివరించారు. భాదితులు చెప్పిన ప్రకారం ఇంట్లో సుమారు 8 తులాలు బంగారం, రూ. 90 వేలు నగదు ఉన్నట్లు తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చిన తరువాత నిర్ధారణ చేస్తామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ద్వారపూడి గ్రామ శివార్లలో ఇటీవల ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. మరో నిందితుడు భువనేశ్వర్‌కు చెందిన రాజేష్ బాగ్ (27) పరారయ్యాడు. ఆ నిందితుడిని విజయనగరం రైల్వే స్టేషను వద్ద సోమవారం విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ రావు అరెస్టు చేసి, అతడి వద్ద నుండి రెండు కిలోల గంజాయిని, రూ.210 నగదు, ఒక సెల్ ఫోను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపినట్లు డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐను ఆయన అభినందించారు.

నేరాలు ఘోరాలు

గుండె పోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని రామాయ వలస పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బి. అప్పలనాయుడు(30) మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎంపిడిఒ భాస్కరరావు తెలిపారు. గుర్ల మండలం గరికివలస గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఇటీ వలే మెరక ముడిదాం మండలానికి బదిలీపై వచ్చారు. సోమవారం సాయంత్రం గుండె పోటు రాగ అతనిని జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళ వారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో ఈయన గుర్ల, గరివిడి మండలాల్లో పనిచేశారు. కటుంబ యజమాని చనిపోవటంతో దిక్కు తోచని స్థితిలో భార్య, పిల్లలు భోరున విలపిస్తున్నారు.


అప్పలనాయుడు(ఫైల్)

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (MOBILE COURT) AT VIZIANAGARAM.
O.S. No. 209/2023

BETWEEN:
Sri JAMPANA RAMA KRISHNA RAJU
....Plaintiff
AND:
Sri SANGAMREDDI RAVI PRASAD
...Defendant

Notice to the Defendant:
Sangamreddi Ravi Prasad S/o Appala Swamy, M.I.G.110, Alakananda Colony, Contonment, Vizianagaram Town and District.

Hg.Date:03-12-2024

పైన తెలిపిన కేసులో వాది మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పై కోర్టువారి నుండి డిఫెండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పైనెంబర్ కేసు తే 03-12-2024 దిన వాయిదా వున్నదని ఈ పత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 03-12-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాల**కు మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

//BY THE ORDER OF THE HONOURABLE COURT//

ఇట్లు
Ch. ప్రవీణ్‌రాజు,
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది,
విజయనగరం
సెల్: 99668 96047